క్లుప్తంగా

పబ్లిక్ టాయిలెట్స్ ఉపయోగించుకోవాలి



క్యాంపెయిన్‌లో మహిళలు, విద్యార్థినులు

కోరుట్లటౌన్: పబ్లిక్ టాయిలెట్స్ ఉపయోగించుకోవాలని మున్సిపల్ ఆధ్వర్యంలో బుధవారం క్లీన్ టాయిలెట్స్ క్యాంపెయిన్‌లో భాగంగా అవగాహన నిర్వహించారు. మున్సిపల్ అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు పరిసర దుకాణదారుల వద్దకు వెళ్లి రాఖీలు కడుతూ బహిరంగ మలమూత్ర విసర్జనలు నిషేధించాలని, పబ్లిక్ టాయిలెట్స్ వాడే విధంగా అవగాహన కల్పించారు. పరిసర ప్రాంతాలు నుంచి వచ్చే ప్రజలు పబ్లిక్ టాయిలెట్స్ వాడేలా సహకరించాలని ప్రచారం చేశారు.

తాగునీటి ట్యాంక్ నిర్మాణానికి భూమి వితరణ



భూమి అందించిన యాదవులు

సారంగాపూర్: మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో యాదవవాడలో మంచినీటి ట్యాంక్ నిర్మాణానికి యాదవ సంఘం సభ్యులు గ్రామపంచాయతీకి భూమిని వితరణ ఇచ్చారు. యాదవవాడలో చాలా కాలంగా మంచినీటి సమస్య ఉండడంతో అక్కడికి ప్రత్యేకంగా నీటిని సరఫరా చేయడానికి ప్రభుత్వం ట్యాంక్‌ను మంజూరు చేసింది. ట్యాంకు నిర్మాణం కోసం భూమి అవసరం ఉండడంతో యాదవులు గ్రామపంచాయతీకి భూమిని వితరణ ఇచ్చారు. ఈ సందర్భంగా యాదవులకు, సంఘ సభ్యులకు సర్పంచ్ పాంపర్తి లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కుడుకల ఎల్లయ్య, బీరయ్య, చంద్రయ్య, గంగమల్లు, రాజం, గంగరాజంతో పాంపర్తి రంజిత్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న తపాలా ఉద్యోగుల సమ్మె



ఆందోళన చేస్తున్న తపాలా ఉద్యోగులు

మెట్‌పల్లి: గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె రెండో రోజు బుధవారం కొనసాగింది. హెడ్ పోస్టాఫీస్ వద్ద ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కమలేశ్ చంద్ర కమిటీ సిఫార్సులను పూర్తిగా అమలు చేసి ఉద్యోగులను ఆదుకోవాలన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకూ సమ్మె విరమించబోమని అన్నారు. కార్యక్రమంలో మీర్జా ఫారూఖ్, లక్ష్మణ్, చరణ్, కిరణ్మయి, భూమేశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందిస్తున్న యువకులు

మల్లాపూర్: గల్ఫ్ దేశానికి వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న గొట్టిపడుత రాజు కుటుంబానికి దాతలు అండగా నిలుస్తున్నారు. బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. దాతలు కనికరపు సంజయ్ రూ.10 వేలు, మాచర్ల ప్రభాకర్ రూ.5 వేలు, చిట్యాల లక్ష్మణ్ రూ.5 వేలతో పాటు మరికొంతమంది రూ.3 వేల నుంచి ఒక వెయ్యి రూపాయల వరకు ఆర్థికసాయం అందజేశారు. బాధితుడు రాజును స్వదేశానికి తీసుకురావడంతో పాటు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న కుటుంబానికి దాతలు అండగా నిలవాలని పలు వురు కోరుతున్నారు.

భూమిపూజ

కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్ శివారులోని శివాలయం ఆవరణలో దాతల సహకారంతో నిర్మించే బాత్ రూంలు, టాయిలెట్స్ నిర్మాణాలకు సర్పంచ్ గుగ్గిళ్ల తుక్కారాం గౌడ్, ఎంపీటీసీ గుగ్గిళ్ల ప్రియాంక బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో గుగ్గిళ్ల సురేశ్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, దాతలు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి

- ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్

పెగడపల్లి: అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ ప్రజలు, ప్రభుత్వానికి జవాబుదారీగా ఉండాలని ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పెగడపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ గోలి శోభ అధ్యక్షతన నిర్వహించగా ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్, జెడ్పీటీసీ రాజేందర్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండలంలోని లింగాపూర్ సర్పంచ్ ఈరెల్లి శంకర్ ఇటీవల మృతి చెందగా, సమావేశంలో సంతాపం ప్రకటించి మౌనం పాటించారు. అనంతరం ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న మండల సమావేశాలకు అధికారులు పూర్తి సమాచారంతో రావాలని, మొక్కుబడిగా హాజరు కావొద్దని సూచించారు. తనను ఎమ్మెల్యేగా ఎన్నుకున్న ప్రజలకు ప్రజాసేవకులుగా ఉంటానని మండలంలో నెలకొన్న ప్రతి సమస్యను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నియోజవర్గంలో ప్రధానంగా సాగు, తాగు నీటి వసతుల కల్పనపై దృష్టి సారించి సాధ్యమైన మేరకు నీటి కొరత లేకుండా చూస్తానని పేర్కొన్నారు. కాళేశ్వరం లింక్–2, మేడారం ప్రాజెక్టుల ద్వారా ధర్మపురి ప్రాంతానికి ప్రయోజనం లేకుండా పోయిందని ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి సీఎం దృష్టికి తీసుకెళ్లి ఈ ప్రాజెక్టుల ద్వారా ఇక్కడి ప్రజలకు నీరందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఖరీఫ్, యాసంగి సీజన్లలో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ అమలు చేసే సంక్షేమ పథకాల విజయవంతం చేయడానికి అధికారులు సహకరించాలన్నారు. మండలంలో రెగ్యులర్ ఏవోను నియమించాలని బతికపల్లి సర్పంచి శోభారాణి కోరారు. ప్రభుత్వ ఆరోగ్య ఉప కేంద్రాల్లో బీపీ. షుగర్ పరీక్షలకు సంబంధించిన కిట్లు అందుబాటులో లేవని ల్యాగలమర్రి ఎంపీటీసీ అంజయ్య అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో 108 వాహనం ఏర్పాటు చేయాలని ఎల్లాపూర్ ఎంపీటీసీ రవి ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యేగా గెలిచిన మొదటి సారిగా మండల సమావేశానికి హాజరైన లక్ష్మణ్ కుమార్‌ను అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించి సత్కరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ గంగాధర్, నంచర్ల విండో చైర్మన్ వేణుగోపాల్ ఎంపీడీవో పుల్లయ్య, తహసీల్దార్ ఎంఏ ఫారూక్, ఎంపీవో మహేందర్, సూపరింటెండెంట్ చక్రాధర్‌గౌడ్, అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్

సర్పంచుల పదవీకాలం పొడిగించాలి

- సర్వసభ్య సమావేశంలో సర్పంచుల వినతి

బుగ్గారం: తమ పదవీకాలాన్ని పొడగించాలని మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు కోరారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బాదినేని రాజమణి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో అధికారులు తమ పరిధిలో జరిగిన అభివృద్ధి పనుల వివరాలను సభలో చదివి వినిపించారు. ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లోని సమస్యలను వినిపించారు. కరోనా కాలంలో పాలన స్తంభించిందని ఈ నేపథ్యంలో తమ పదవికాలాన్ని పొడిగించాలని కోరుతూ సభలో తీర్మానం చేయాలని సర్పంచులు కోరారు. అనంతరం తమ గ్రామాలోల నెలకొన్న సమస్యలను వివరించారు. పైపులైన్ల లీకేజీలతో గ్రామాల్లో భగీరథ నీరు రావడం లేదని సర్పంచులు ఆరోపించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రాజేందర్ మాట్లాడుతూ నీటి సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలన్నారు. వెల్గొండ సర్పంచ్ తిరుపతి మాట్లాడుతూ తమ గ్రామంలోని సర్వే నెంబరు 623లో సుమారు 20 నుంచి 25 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు ప్రభుత్వ భూమికి హద్దులు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారిపై బుగ్గారం ఎక్స్ రోడ్డు సమీపంలో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపాలని ఆర్టీసీ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యమని పలువురు ఎంపీటీసీలు,సర్పంచులు తెలిపారు. మండలంలోని బీర్‌సాని, సిరికొండ, వెల్గొండ, చందయ్యపల్లె, శెకెల్ల, యశ్వంతరావుపేట గ్రామాలకు బస్సు సౌకర్యం లేదని ఇకనైనా రవాణా సదుపాయాన్ని కల్పించాలని కోరారు. మండలానికి మరో బస్సును ఏర్పాటు చేయాలని మద్దునూర్ ఎంపీటీసీ గాలిపెల్లి మహేశ్ కోరారు. నర్సరీలలో మొక్కల పెంపకానికి అవసరమైన ఎర్ర మట్టికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయనీ ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయం తెలిపి అటవీశాఖ అధికారులతో మాట్లాడాలని సర్పంచులు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుపతి, ఎంపీవో అఫ్జల్ మియా, కోఆప్షన్ సభ్యుడు రహమాన్,సర్పంచులు,ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ రాజమణి

ఆటో డ్రైవర్ల ఆందోళన



ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు

మెట్‌పల్లి: ఆర్టీసీ బస్సుల్లో ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణాన్ని కల్పించడాన్ని నిరసిస్తూ పట్టణంలో ఆటో డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. కోరుట్ల, మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాలకు చెందిన వందలాది మంది ఆటో డ్రైవర్లు పట్టణంలోని మినీ స్టేడియంకు చేరుకుని అక్కడి నుంచి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయం, అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో తమకు గిరాకీలు తగ్గిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగే కొనసాగితే ఉపాధి దెబ్బతిని తమ కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. ప్రభుత్వం దీనిని దృష్టిలో పెట్టుకొని తమ ఉపాధి దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుగ్లావత్ శివలాల్, ప్రధాన కార్యదర్శి రంగు సంపత్, యామ గణేష్, గంగాధర్, వెంకటరమణ, హైమద్, శంకర్, నవాబ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అభినందన



ఎమ్మెల్యేకు అభినందనలు తెలుపుతున్న అధికారులు

జగిత్యాల: రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన సంజయ్‌కుమార్‌ను జగిత్యాల నియోజకవర్గ ఎంపీడీవోలు, ఎంపీవోలు కలిసి అభినందనలు తెలిపారు.

క్యాంప్ ఆఫీస్‌కు ఎమ్మెల్యే సంజయ్



ఎమ్మెల్యేను ఆశీర్వదిస్తున్న వేద పండితులు

కోరుట్ల: ఎమ్మెల్యేగా గెలుపొందిన కల్వకుంట్ల సంజయ్ బుధవారం మొదటిసారిగా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌కు వచ్చారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం విద్యా శాఖ, ఆరోగ్య శాఖ అధికారులు ఎమ్మెల్యే సంజయ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యాశాఖపై అధికారులతో ఎమ్మెల్యే సంజయ్ సమీక్షించారు. పలు కుల సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షుడు అన్నం అనిల్, దారిశెట్టి రాజేష్, చీటి వెంకట్రావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే లక్ష్యాలు విధించుకోవాలి

ధర్మపురి: విద్యార్థి దశనుంచే లక్ష్యాలు విధించుకోవాలని సామాజిక సేవకుడు, ఇంపాక్ట్ ట్రైనర్ రేణికుంట రమేశ్ అన్నారు. ధర్మపురి ప్రభుత్వ మైనార్టీ జూనియర్ కళాశాల విద్యార్థినులకు బుధవారం వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రమేశ్ విద్యార్థులకు ఏకాగ్రత పెంచుకోవడానికి పలు సూచనలు ఇచ్చారు. ప్రతి పనికి రెండు యాక్షన్స్ ఉంటాయని మొదటగా మెదడులో జరుగుతుందని తదుపరి బైట జరుగుతుందని సూచించారు. అందుకే విద్యార్థులు సరైన ఆలోచనలపై దృష్టి కేంద్రీకరించాలని ఆలోచనలతో ఫీలింగ్స్ కలుగుతాయని, ఫీలింగ్స్‌తో యాక్షన్ ఉంటుందని, యాక్షన్‌తో ఫలితం ఉంటుందని పేర్కొన్నారు. కష్టపడి చదువుకునే విద్యార్థులకు ప్రతి ఒక్కరు సహకరిస్తారని ధైర్యాన్నిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజీదబాను, అధ్యాపకులు పాల్గొన్నారు.



వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

ఈకేవైసీ కోసం బారులు తీరిన మహిళలు

మల్యాల: మండలంలోని భారత్ గ్యాస్ సిలిండర్ కార్యాలయం వద్ద మహిళలు ఈ కేవైసీ కోసం బారులు తీరారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళలు ఈ కేవైసీ కోసం ఉదయం నుంచి క్యూ కడుతున్నారు. అధిక సంఖ్యలో మహిళలు తరలిరావడంతో ఈకేవైసీ చేసుకునేందుకు గంటల తరబడి క్యూలో నిలబడలేక ఇబ్బందులు పడుతున్నారు. వినియోగదారుల సేవల కోసం ఆయా గ్రామాల్లోనే ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి, ఈకేవైసీ చేయాలని వినియోగదారులు కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్‌రావును వివరణ కోరగా ఈకేవైసీ చేయించుకునేందుకు సమయం ఉందని, వినియోగదారులు ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు.



కార్యాలయం వద్ద బారులు తీరిన మహిళలు

రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్‌లో విద్యార్థి ప్రతిభ



కోచ్ గణేశ్‌తో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బుగ్గారం: మండల కేంద్రానికి చెందిన నగునూరి హరీశ్ అనే విద్యార్థి అండర్ –15, లైట్ కాంటాక్ట్ 62 కేజీల విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటి సిల్వర్ మెడల్ సాధించాడు. స్థానిక ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువున్న హరీశ్ బాక్సింగ్ కోచ్ మామిడిపెల్లి గణేశ్ పర్యవేక్షణలో గత కొంతకాలంగా ప్రత్యేక శిక్షణ పొందుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 10 వ తేదీన వరంగల్ పట్టణంలో నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి పతకం సాధించడంపై ప్రజాప్రతినిధులు,నాయకులు, కోచ్‌లు కస్తూరి ప్రవీణ్, రామాంజనేయులు అభినందించారు.

జాతీయ పోటీలకు విద్యార్థి ఎంపిక

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని జ్యోతి హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని సంజన డిసెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించిన ఎస్జీఎఫ్ స్టేట్ బాస్కెట్ బాల్ పోటీల్లో కాంస్య పతకం సాధించింది. అలాగే 2024 జనవరి 8 నుంచి 13 వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని బర్మార్‌లో నిర్వహించే 67వ నేషనల్ స్కూల్‌గేమ్స్‌కు ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థినిని డైరెక్టర్ హరిచరణ్‌రావు, శ్రీధర్‌రావు, మౌనికరావు అభినందించారు.

ఘనంగా అయ్యప్పస్వామి జాతర



అయ్యప్పస్వామి పూజల్లో పాల్గొన్న దీక్షాపరులు

కథలాపూర్: కథలాపూర్ మండలం పెగ్గెర్ల గ్రామంలో అయ్యప్పస్వామి జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్పదీక్షాపరులు, భక్తులు ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. అయ్యప్పస్వామి నామస్మరణం మార్మోగింది. భక్తులకు అన్నదానం చేశారు. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సర్పంచ్ జవిడి ప్రతాప్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు పాల్తెపు గంగారాం, గురుస్వామి పూంద్ర భూమారెడ్డి, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో బుధవారం గుజ్జె గంగాధర్ అనే అయ్యప్ప భక్తుడు అయ్యప్ప పడిపూజను ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంలో అయ్యప్పదీక్షదారులు ఏలేటి(గుండేటి) వెంకట్‌రెడ్డి స్వగృహంలో బుధవారం అయ్యప్ప మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, అయ్యప్ప దీక్షస్వాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మల్యాల: మండల కేంద్రంలోని వ్యాపారవేత్త, సామాజిక సేవకులు సూర మహేశ్, సహర్స్ ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. స్వామివారి భజనలతో పరిసరాలు మార్మోగాయి.

అయ్యప్ప స్వాములకు ముస్లిం భిక్ష



స్వాములు భిక్ష వడ్డిస్తున్న మహబూబ్ ఖాన్

మల్లాపూర్: మతసామరస్యానికి ప్రతీకగా నిలిచాడు ముస్లిం నాయకుడు ఎండీ.మహబూబ్‌ఖాన్. బుధవారం మల్లాపూర్ మండలంలోని మొగిలిపేటలో ఆయన స్వగృహంలో అయ్యప్పస్వాముల(దీక్షదారులు)కు భిక్ష పెట్టారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు, పీసీసీ ఫిషర్మెన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ,అయ్యప్పదీక్షదారులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న నాయకులు



టెంకాయ మొక్కులు తీర్చుకుంటున్న నాయకులు



కోడె మొక్కు చెల్లిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ధర్మపురి: ధర్మపురి ఎమ్మెల్యేగా అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గెలుపొందడంపై కాంగ్రెస్ నాయకుడు వొజ్జల లక్ష్మణ్ బుధవారం అయ్యప్ప స్వామి ఆలయంలో 108 టెంకాయలు కొట్టి తన మొక్కులను చెల్లించుకున్నాడు. అనంతరం అడ్లూరి గోత్ర నామాలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వేముల రాజేశ్, సీనియర్ నాయకులు సీపతి సత్యనారాయణ, అశెట్టి శ్రీనివాస్, ప్రమోద్, రమణ, శ్రీనివాస్ తదితరులున్నారు.

మల్లాపూర్: అసెంబ్లీ ఎన్నికల్లో కోరుట్ల ఎమ్మెల్యేగా డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కుమార్ గెలవడంతో బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీటీసీ బిట్ల నరేశ్ (వేంపల్లి), మచ్చర్ల దశరెడ్డి(వెంకట్రావ్‌పేట) బుధవారం వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోరుట్ల ఎమ్మెల్యేగా సంజయ్‌కుమార్ గెలిస్తే.. వేములవాడ రాజన్నకు కోడె మొక్కు చెల్లిస్తామని కోరుకున్నట్లు తెలిపారు. ఈ నెల 3 న ప్రకటించిన ఫలితాలలో ఎమ్మెల్యేగా గెలవడంతో మొక్కు తీర్చినట్లు పేర్కొన్నారు.

నిలిచిన రిజిస్ట్రేషన్లు

ఇబ్రహీంపట్నం: మండల తహసీల్దార్‌కు ప్రసాద్‌కు లాగ్‌ఇన్ లేకపోవడంతో రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. శాసనసభ ఎన్నికల సందర్భంగా రెవెన్యూ అధికారులు కోరుట్ల ఆర్‌డీవో కార్యాలయంలో విధులు నిర్వహించారు. దీంతో మెట్‌పల్లి ఆర్‌డీవో కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న వసంతకు లాగ్‌ఇన్ సౌకర్యం కల్పించారు. ఆమె కొద్ది రోజుల పాటు ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్లు చేశారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత తహసీల్దార్‌కు లాగ్‌ఇన్ సౌకర్యం కల్పించకపోవడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. వెంటనే తహసీల్దార్‌కు లాగ్‌ఇన్ సౌకర్యం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పెగడపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలు సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో నర్సింగరాణి కోరారు. పెగడపల్లి, బతికపల్లి, ఆరవెల్లి, దోమలకుంట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం సుపోషణ్ దివస్‌లో భాగంగా చిన్నారులకు సామూహిక అక్షరభ్యాసం, అన్నప్రాసన, గర్భిణులకు సీమంతాలు జరిపించారు. పౌష్టికాహారంపై ప్రతిజ్ఞలు చేయించారు. పెగడపల్లిలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో పాల్గొని మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆరోగ్య సలహాలు పాటించి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఆయా కేంద్రాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం చేస్తున్న సీడీపీవో, అంగన్‌వాడీ టీచర్లు

భగవద్గీత ఆధ్యాత్మిక గ్రంథాలపై అవగాహన



గ్రంథాలు ఆవిష్కరిస్తున్న ప్రబోధ సమితి సభ్యులు

జగిత్యాలరూరల్: మండలంలోని పెర్కపల్లిలో బుధవారం ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మార్గశిర మాసం మొదటి రోజు త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక జగిత్యాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఈ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి కమిటీ సభ్యులు విద్యాధర్, గోపాలకిషన్, శివ, గోపాల్, రశ్మిత పాల్గొన్నారు.

భగవద్గీత పోటీల్లో విద్యార్థి ప్రతిభ



ప్రథమ బహుమతి అందుకుంటున్న శ్రీరాం

కోరుట్లటౌన్: జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి శ్రీమద్భగవద్గీత కంఠస్తం పోటీల్లో కోరుట్లకు చెందిన పదో తరగతి విద్యార్థి ఆమేటి శ్రీరాం ప్రథమ స్థానం సాధించినట్లు టీటీడీ ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణమూర్తి, హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కన్వీనర్ మంచాల జగన్ బుధవారం తెలిపారు. ఆమేటి శ్రీరాం 7 వందల శ్లోకాలు కంఠస్తంలో ప్రతిభ చాటాడు. కార్యక్రమంలో న్యాయనిర్ణేతలు గుడికందుల వెంకన్న, రవీందర్, రాంచంద్రం, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో నేడు మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో భీమేశ్ తెలిపారు.ఏప్రిల్ 1, 2022 నుంచి మార్చి 31, 2023 వరకు మెట్‌పల్లి మండలంలోని 23 గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనుల గురించి ఈ ప్రజావేదికలో వెల్లడిస్తారన్నారు. మొత్తంగా సుమారు రూ.3 కోట్ల నిధులతో ఉపాధిహామీ పనులు చేయగా, పనులు జరిగిన ప్రదేశాలకు తనిఖీ బృందాలు వెళ్లి పరిశీలించి తుది నివేదికను సిద్ధం చేశారు.

16న సారంగాపూర్ మండల సమావేశం

సారంగాపూర్: ఈ నెల 16న ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం సారంగాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజేందర్ తెలిపారు. ఎంపీపీ కోల జమున అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.